సాక్షి
మహబూబాబాద్

బుధవారం । 15 । మే । 2024



ప్రమాదాలకు కేరాఫ్.. దాబాలు

హైదరాబాద్–హనుమకొండ జాతీయ రహదారిపై విచ్చలవిడిగా దాబాలు వెలుస్తున్నాయి. డివైడర్లు, క్రాసింగ్‌ల వద్ద ఏర్పాటు చేయడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. - 8లో▸



రెండిళ్లలో చోరీ

జిల్లా కేంద్రంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉండే ఇరువురి ఇళ్లలో సోమవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. బంగారం, వెండి, నగదు అపహరించారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
39.8° /25.1°

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఉంటుంది. పలుచోట్ల ఆకాశం మేఘావృతమై చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

పోలింగ్‌పై లెక్కలు..



- అసెంబ్లీ ఎన్నికల మెజార్టీ ఆధారంగా గెలుపుపై కాంగ్రెస్ ధీమా
- గత పార్లమెంట్ ఎన్నికల ఫలితాలే అంటున్న బీఆర్‌ఎస్
- డోర్నకల్, మహబూబాబాద్ నియోజకవర్గాలపై కవిత ఆశలు
- ఓటు బ్యాంకు పెరుగుతుందంటున్న కమలనాథులు



సోమవారం ఓటు హక్కు వినియోగించుకునేందుకు క్యూలో నిల్చున్న మహిళా ఓటర్లు

సాక్షి, మహబూబాబాద్: పార్లమెంట్ ఎన్నికల్లో కీలక పోలింగ్ ప్రక్రియ ముగియంతో ఎవరికి ఎన్ని ఓట్లు వస్తాయి.. ఎక్కడ తగ్గుతాయి.. ఎక్కడ పెరుగుతాయనే లెక్కలు వేస్తున్నారు. ఏ పార్టీకి ఏ నియోజకవర్గంలో పట్టుంది.. చివరికి విజయం ఎవరిని వరిస్తుంది.. ఎంత మెజార్టీ వస్తుందని రాజకీయ పార్టీల నాయకులు లెక్కలు వేసుకుంటున్నారు. కాగా ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఊపులోనే ఓటర్లు ఓటు వేశారు.. ఆ ఫలితాలే పునరావృతమవుతాయని కాంగ్రెస్ నాయకులు లెక్కలు వేసుకుంటున్నారు. అలాగే కాంగ్రెస్ వందరోజుల పాలనపై ప్రజల్లో అసంతృప్తి మొదలైంది.. అది బీఆర్‌ఎస్‌కు లాభిస్తుంది.. గత పార్లమెంట్ ఎన్నికల్లో వచ్చిన ఫలితాలే ఇప్పుడు కూడా వస్తాయని పార్టీ నాయకులు అంటున్నారు. అయితే మాకు మాత్రం ఈ సారి ఓటు బ్యాంకు పెరుగుతుందని బీజేపీ నాయకులు చెబుతున్నారు.

కాంగ్రెస్ ధీమా అదే..

గత అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన ఫలితాలే మానుకోట పార్లమెంట్ ఎన్నికల్లో పునరావృతం అవుతాయని కాంగ్రెస్ నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. పార్లమెంట్ పరిధిలోని మానుకోట, డోర్నకల్, నర్సంపేట, ములుగు, పినపాక, భద్రాచలం, ఇల్లెందు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా.. భద్రాచలం మినహా ఆరు నియోజకవర్గాలు కాంగ్రెస్ అభ్యర్థులు గెలిచారు. మొత్తం 15లక్షల పైచిలుకు ఓటర్లు ఉండగా.. ఇందులో 6,80,178 ఓట్లు కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసిన అభ్యర్థులకు రాగా.. 4,79,995 ఓట్లు ప్రత్యర్థి బీఆర్‌ఎస్ పార్టీకి వచ్చాయి. అంటే 2,00,183ఓట్లు కాంగ్రెస్ పార్టీకి ఎక్కువగా వచ్చాయి. దీనికి తోడు భద్రాచలం నుంచి గెలిచిన తెల్లం వెంకట్రావు కాంగ్రెస్ గూటికే చేరారు. ఈ రాజకీయ సమీకరణాల నేపథ్యంలో రెండు లక్షల పైచిలుకు ఓట్ల మెజార్టీతో తాము గెలుస్తామని కాంగ్రెస్ నాయకులు చెబుతున్నారు.

గత పార్లమెంట్ ఫలితాలే..

అసెంబ్లీ ఎన్నికలు వేరు పార్లమెంట్ ఎన్నికలు వేరు. అదే విధంగా కాంగ్రెస్ పార్టీ వంద రోజుల పాలనతో ప్రజల్లో వ్యతిరేకత మొదలైంది. ఈ నేపథ్యంలో మహబూబాబాద్ పార్లమెంట్ నుంచి మరోసారి బీఆర్‌ఎస్ అభ్యర్థి గెలుపు ఖాయమని ఆ పార్టీ నాయకులు లెక్కలు వేస్తున్నారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో 4,61,824 ఓట్లు బీఆర్‌ఎస్ అభ్యర్థి మాలోత్ కవితకు రాగా.. అప్పుడు, ఇప్పుడు ప్రత్యర్థి పోరిక బలరాంనాయక్‌కు 3,15,262ఓట్లు వచ్చాయి. దీంతో 1,47,562ఓట్ల మెజార్టీ బీఆర్‌ఎస్‌కు ఉంది. అభ్యర్థిలో మార్పు లేకపోవడంతో మళ్లీ కవిత గెలుస్తుందని బీఆర్‌ఎస్ నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

నియోజకవర్గాల వారీగా లెక్కలు

గత అసెంబ్లీ ఎన్నికల్లో మహబూబాబాద్‌లో 50,171ఓట్ల మెజార్టీ, డోర్నకల్‌లో 53,131ఓట్ల మెజార్టీతో కాంగ్రెస్ అభ్యర్థులు గెలిచారు. అయితే ఈ ఎన్నికల్లో ఈ రెండు నియోజకవర్గాల్లో తమకే ఎక్కువ ఓట్లు వస్తాయని బీఆర్‌ఎస్ నాయకులు చెబుతున్నారు. అదేవిధంగా భద్రాచలంలో నాయకులు మారినా.. ఓటర్లు మారలేదని బీఆర్‌ఎస్‌దే మెజార్టీ అంటున్నారు. ఇల్లెందు, ములుగు, నర్సంపేటలో కూడా అసెంబ్లీ ఎన్నికల కన్నా ఎక్కువ ఓట్లు పడుతాయని బీఆర్‌ఎస్ నాయకులు అంచనా వేస్తున్నారు. ఇదిలా ఉండగా ఓటు బ్యాంకు చీలకుండా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు జాగ్రత్త పడ్డారు. అదివాసీ, గిరిజనులు కూడా కాంగ్రెస్‌కే పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారు. ఇన్ని అనుకూల పరిస్థితుల్లో కాంగ్రెస్ విజయాన్ని ఆపలేరు. అసెంబ్లీ ఎన్నికల కన్నా మెజార్టీ వస్తుందని కాంగ్రెస్ నాయకులు లెక్కలు చెబుతున్నారు. అదే విధంగా బీజేపీ అభ్యర్థి సీతారాంనాయక్‌కు పార్లమెంట్ పరిధిలో బలమైన ఓటు బ్యాంకు ఉంది. మోదీ చరిష్మాతో గత పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల కన్నా ఎక్కువ ఓట్లు వస్తాయి. 50వేలకు పైగా ఓట్లు బీజేపీకి వస్తాయని ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు. ఇలా ఎవరికి వారుగా పోలింగ్ సరళి, ఓట్ల లెక్కలు వేసుకుంటున్నారు.

71.85 % ఓటింగ్

- మానుకోట పార్లమెంట్ పరిధిలో ఓటర్లు 15,32,366
- ఓటు హక్కు వినియోగించుకున్నవారు 11,01,030
- మహిళల ఓటింగ్ శాతమే ఎక్కువ

మహబూబాబాద్: పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ సోమవారం ముగిసింది. మానుకోట సెగ్మెంట్‌లో 71.85శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో 15,32,366 మంది ఓటర్లు ఉండగా.. 11,01,030మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరిలో పురుష ఓటర్లు 5,42,304మంది, మహిళా ఓటర్లు 5,58,678 మంది, ఇతరులు 48 మంది ఓటు వేశా రు. మొత్తంగా మహిళల ఓటింగ్ శాతం ఎక్కువగా ఉంది.

భద్రాచలంలో తక్కువ..

మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలో నర్సంపేట అసెంబ్లీ నియోజకవర్గంలో అధికశాతం పోలింగ్ నమోదు కాగా.. భద్రాచలంలో తక్కువశాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. కాగా నర్సంపేట తర్వాత డోర్నకల్ నియోజకవర్గంలో అధిక శాతం పోలింగ్ నమోదైనట్లు చెప్పారు.

అభ్యర్థుల్లో టెన్షన్..

జూన్ 4వ తేదీన ఓట్ల లెక్కంపు ఉండగా.. అప్పటి వరకు అభ్యర్థులకు టెన్షన్ తప్పదు. ఈవీఎంల్లో వారి భవిత్యం ఉండగా.. వాటిని జిల్లా కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ పాఠశాల స్ట్రాంగ్ రూంల్లో భద్రపరిచారు. పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల ఈవీఎంలను ఇక్కడే భద్రపరిచారు. వచ్చే 4న ఈ పాఠశాలలోనే కౌంటింగ్ ఉంటుందని అధికారులు తెలిపారు.

పార్లమెంట్ పరిధిలో నియోజకవర్గాల వారీగా ఓటర్లు, ఓటింగ్ శాతం

నియోజకవర్గం	మొత్తం ఓటర్లు	ఓటువేసిన వారు	పోలింగ్ శాతం
డోర్నకల్	2,22,906	1,68,053	75.39
మానుకోట	2,58,850	1,84,410	71.24
నర్సంపేట	2,35,849	1,80,659	76.60
ములుగు	2,33,191	1,62,443	69.66
పినపాక	2,03,790	1,41,432	69.40
ఇల్లెందు	2,25,097	1,58,650	70.48
భద్రాచలం	1,52,683	1,05,383	69.02
మొత్తం	15,32,366	11,01,030	71.85

న్యూస్‌రీల్

దోమల వ్యాప్తిని అరికట్టాలి



డోర్నకల్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ దోమల వ్యాప్తిని అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని డీఎంహెచ్‌ఓ బి.కళావతిబాయి ఆదేశించారు. మండలంలోని చాప్లాతండా శివారు దారావత్‌తండాను మంగళవారం వైద్య సిబ్బందితో కలిసి ఆమె సందర్శించారు. ఇటీవల తండాలో ఐదు డెంగీ పాజిటివ్ కేసులు నమోదు కావడంతో.. వ్యాధిబారిన పడిన వారి ఇళ్లతో పాటు పరిసరాల్లోని 62 ఇళ్లను పరిశీలించారు. ఇళ్ల పరిసరాలు, నీటి తొట్టెలు పరిశీలించి స్థానికులతో మాట్లాడిన డీఎంహెచ్‌ఓ డెంగీ వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. మధ్యాహ్నం దోమలు కుట్టడం ద్వారా డెంగీ వ్యాప్తి చెందుతుందని, ఇళ్ల పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మంగళ, శుక్రవారాల్లో డ్రై డే, ఫ్రైడేలు నిర్వహించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డాక్టర్ నాగేశ్వర్‌రావు, డాక్టర్ శ్రవణ్, ఇన్‌చార్జ్ డీపీహెచ్‌ఎన్‌ఓ మంగమ్మ, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి



గూడూరు: జాతీయ ఆరోగ్య కార్యక్రమాల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ అంబరీష అన్నారు. మండలంలోని అయోధ్యపురం, తీగలవేణి పీహెచ్‌సీలతో పాటు గాజులగట్టులోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రుల్లో సిబ్బంది విధుల నిర్వహణ, ఆరోగ్య పరీక్షలు, మందుల నిల్వలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల్లో అందిస్తున్న వైద్య సేవల గురించి వైద్యులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వైద్యులు, సిబ్బంది సమయానికి హాజరై విధులు నిర్వర్తించాలని సూచించారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో పొందుపర్చాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు రాంబాబు, యమున, దేవేందర్, పుష్పలత, సబ్ యూనిట్ ఆఫీసర్ వి.శ్రీనివాస్, సీహెచ్‌ఓ కృష్ణార్జున్, కోమల, సిబ్బంది షానుబేగం, ఫార్మసిస్టు అమల, సిబ్బంది పాల్గొన్నారు.

నిరుపయోగంగా ఎస్సీ దుకాణ సముదాయం



మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఎదురుగా షెడ్యూల్ కులాల (ఎస్సీ)కు సంబంధించిన దుకాణ సముదాయం నిరుపయోగంగా మారింది. ఇక్కడ సుమారు 10 షెటర్లు ఉన్నాయి. మరమ్మతులు చేయించి అర్హులైన దళిత కుటుంబాలకు కేటాయిస్తే అభివృద్ధి చెందుతాయి. కాగాఅధికారులు చొరవ తీసుకొని పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టి కేటాయించాలని పలువురు కోరుతున్నారు.

తాటి ముంజలకు భలే గిరాకీ..



జిల్లా కేంద్రంలోని అండర్‌బ్రిడ్జి, రామాలయం గుడి ఎదురుగా తాటి ముంజలను విక్రయిస్తున్నారు. దీంతో ప్రజలు కొనుగోలు చేసి ఇళ్లకు తీసుకెళ్తున్నారు. కాగా వీటిలో విటమిన్స్, ఖనిజ లవణాలు మెండుగా ఉండి రోగ నిరోధక శక్తిని పెంచుతాయని వైద్యులు తెలుపుతున్నారు. అలాగే శరీరంలోని వేడిని తగ్గించడంతో పాటు.. హానికర వ్యర్థాలను తొలగిస్తాయి. దీంతో ప్రజలు ఒక్కో దానికి రూ.5చెల్లించి కొనుగోలు చేస్తున్నారు.

– మహబూబాబాద్ అర్బన్



కేంద్రంలో ఇండియా కూటమిదే అధికారం

- అత్యధిక మెజార్టీతో బలరాంనాయక్ గెలుపు ఖాయం
- ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్, ఎమ్మెల్యే మురళీనాయక్



మాట్లాడుతున్న కాంగ్రెస్ నేతలు

మహబూబాబాద్ రూరల్: కేంద్రంలో ఇండియా కూటమి అధికారం దిశగా ముందుకు సాగుతోందని ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్, ఎమ్మెల్యే మురళీనాయక్ అన్నారు. మానుకోటలోని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మహబూబాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో అహర్నిశలు కష్టపడిన కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం నాయకులు, కార్యకర్తలందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ మానుకోట అభ్యర్థి పోరిక బలరాంనాయక్ అత్యధిక మెజార్టీతో గెలుస్తారని, తప్పకుండా కేంద్ర మంత్రి అవుతారని ధీమా వ్యక్తం చేశారు. కేంద్రంలో ఇండియా కూటమికే అధికారం దక్కుతుందన్నారు. బీజేపీ పదేళ్ల పాలనలో చేసిన అభివృద్ధి శూన్యమని ఆరోపించారు. ఇచ్చిన మాట ప్రకారం రైతుబంధు గడువు కంటే ముందే రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఎప్పుడు కూడా మహబూబాబాద్ జిల్లాను తీసివేస్తామని చెప్పలేదన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్ రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాంనాయక్, నాయకులు అంజయ్య, ఉదయ్‌చందర్, యాదవరెడ్డి, దస్రు నాయక్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, రామిరెడ్డి, ప్రభాకర్, వెంకన్న, వెంకటేశ్వర్లు, రమేష్, సీతారాం రెడ్డి, సతీష్, వెంకటరెడ్డి, కౌన్సిలర్లు హరిసింగ్, శ్రీను, నాయకులు పాల్గొన్నారు.

ఓటు వేసిన ప్రతీ ఒక్కరికి రుణపడి ఉంటా

- బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి మాలోత్ కవిత



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

మహబూబాబాద్: తనకు ఓటు వేసిన ప్రతీ ఒక్కరికి రుణపడి ఉంటానని బీఆర్‌ఎస్ మానుకోట ఎంపీ అభ్యర్థి మాలోత్ కవిత అన్నారు. జిల్లా కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీకి కొన్ని సామాజిక వర్గాలు దూరమయ్యాయన్నారు. కేసీఆర్ సీఎంగా లేని లోటు ప్రజలకు ఇప్పుడు అర్థమై బీఆర్‌ఎస్ వైపు మొగ్గు చూపారని చెప్పారు. మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ.. తులం బంగారం లాంటి బంగారు మాటలే మిగిలాయే తప్ప.. కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క పని చేయలేదన్నారు. ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్‌కు ఎన్నికలు ముఖ్యం కాదని, ప్రజల శ్రేయస్సే ముఖ్యమన్నారు. సమావేశంలో జెడ్పీ చైర్‌పర్సన్ ఆంగోత్ బిందు, మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్, మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, చిట్యాల జనార్దన్, కన్నా, రవికుమార్ పాల్గొన్నారు.

మహిళా సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



మాతృమూర్తులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, ఝాన్సీరెడ్డి

తొర్రూరు రూరల్: మహిళా సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. ఉమెన్ ఎంపవర్‌మెంట్ తెలుగు అసోసియేషన్ (వేటా) ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని నాంచారిమడూరు శివారు రెడ్డి గార్డెన్‌లో మాతృదినోత్సవ వేడుకలు నిర్వహించారు. సంస్థ వ్యవస్థాపకురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని మాతృమూర్తులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారత దిశగా అడుగులు వేస్తోందన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మహిళలకు ఏడాదికి రూ.లక్ష సాయం అందుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీల్లో మొదటి హామీగా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణాన్ని అమలు చేసిందని గుర్తు చేశారు. రూ.500కే గ్యాస్ సిలిండర్ అందుతుందన్నారు. ఇందిరమ్మ ఇళ్లను మహిళల పేరిట అందిస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు మంత్రి పదవులు ఇవ్వడంతో పాటు అన్ని రంగాల్లో సమాన అవకాశాలు కల్పిస్తుందని గుర్తు చేశారు. మహిళా రక్షణకు ప్రభుత్వం టీ–సేఫ్ యాప్‌ను ప్రారంభించిందని, ఈ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకున్న మహిళలు ప్రయాణంలో ఆపదకు గురైతే తక్షణమే పోలీసులు అక్కడకు చేరుకుని వారిని రక్షిస్తారన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే భర్త రాజారామ్మోహన్‌రెడ్డి, ఈజీఎస్ రాష్ట్ర డైరెక్టర్ లింగాల వెంకటనారాయణగౌడ్, నాయకులు గుండాల నర్సయ్య, జాటోతు నెహ్రూ, సుంచు సంతోష్, గోపాల్‌రెడ్డి, మంగళపల్లి రామచంద్రయ్య, పెదగాని సోమయ్య, బాపురెడ్డి, సోమ రాజశేఖర్, సోమిరెడ్డి, ఉష తదితరులు పాల్గొన్నారు.

కట్టడికి కట్టుదిట్టం

- సికిల్‌సెల్ ఎనిమియా నివారణకు వ్యూహం
- ఫస్ట్ విడతలో 70వేల మందికి స్క్రీనింగ్
- 190 మంది క్యారియర్స్, ఇద్దరు వ్యాధిగ్రస్తుల గుర్తింపు
- ఏజెన్సీ ప్రాంతాలపై వైద్యాధికారుల ప్రత్యేక దృష్టి



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది (ఫైల్)

నెహ్రూసెంటర్: జిల్లాలో సికిల్‌సెల్ ఎనిమియా వ్యాధి నివారణకు వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో చర్యలు తీసుకుంటున్నారు. జన్యుపరంగా కుటుంబ సభ్యుల నుంచి సంక్రమించడంతో పాటు ఒకరికి నుంచి మరొకరికి ఈ వ్యాధి సంక్రమించే అవకాశం ఉంది. ఈమేరకు ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు ఏజెన్సీ, మైదాన ప్రాంతాల్లో మొదటి విడత స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. కాగా ఇప్పటివరకు 70వేల మందికి పరీక్షలు నిర్వహించగా.. ఇద్దరు వ్యాధిగ్రస్తులను గుర్తించారు. అలాగే 190 మంది క్యారియర్లను గుర్తించారు. కాగా వీరు మరొక సికిల్‌సెల్ క్యారియర్‌ను పెళ్లి చేసుకోవడం ద్వారా వారికి పుట్టబోయే పిల్లలకు వ్యాధి సక్రమించనుంది. ఇలాంటి వారు పెళ్లిళ్లు చేసుకోకపోవడమే మంచిదని వైద్యులు చెబుతున్నారు.

వైద్య సిబ్బందికి శిక్షణ..

సికిల్ సెల్ ఎనిమియా వ్యాధి గుర్తింపులో భాగంగా స్క్రీనింగ్ పరీక్షల కోసం వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో మెడికల్ ఆఫీసర్లు, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలకు శిక్షణ కార్యక్రమాలు చేపట్టారు. వ్యాధిపై అవగాహన, పరీక్షలు, చికిత్సలపై శిక్షణ అందించారు.

0నుంచి 40 సంవత్సరాల వరకు..

సికిల్‌సెల్ వ్యాధి గుర్తింపు కోసం 0నుంచి 40ఏళ్ల లోపు వారందరికీ వైద్యాధికారులు, వైద్య సిబ్బంది పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఏజెన్సీ, గిరిజన ప్రాంతాల్లో మొదటి విడతలో స్క్రీనింగ్ నిర్వహిస్తూ వ్యాధిపై అవగాహన కల్పిస్తున్నారు. ప్రతి ఒక్కరు వ్యాధి పరీక్షల కోసం తమ ఆధార్‌కార్డును అప్‌డేట్ చేసుకుని మొబైల్ నంబర్ లింక్ చేసుకోవాలని, అభా (ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఖాతా) కార్డును పొందాలని సూచిస్తున్నారు. వ్యాధి పరీక్షల అనంతరం వైద్య చికిత్స కోసం ఈ కార్డు ఉపయోగపడుతుందని తెలుపుతున్నారు.

వ్యాధి లక్షణాలు..

ఈ వ్యాధి బారిన పడుతున్న వారిలో ముఖ్యంగా కాళ్లు, చేతులు నొప్పితో కూడిన వాపు, రక్తహీనత, కీళ్లకు రక్తప్రసరణ ఆగిపోవడం, ఎముకల్లో కొన్ని గంటల పాటు దీర్ఘకాలిక నొప్పి ఉంటుంది. ఇది జన్యు సంబంధిత దీర్ఘకాలిక వ్యాధి కాగా కుటుంబంలో ఒకరి నుంచి మరొకరికి సంభవిస్తుంది. ఈ వ్యాధికి పూర్తి చికిత్స లేదు. సికిల్‌సెల్ క్యారియర్లను గుర్తించి వారి మధ్య వివాహలను నిరోధించడం ద్వారా ఈ వ్యాధిని కొంత మేరకు నివారించవచ్చని వైద్యులు తెలుపుతున్నారు. వ్యాధికి కచ్చితమైన చికిత్స లేకపోయినా మూలకణాల మార్పిడి, బోన్ మారో ట్రాన్స్‌ప్లాంట్ అంటే కణాల మార్పిడితో వ్యాధిని కొంత వరకు నయం చేయవచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు.

గిరిజనులపై తీవ్ర ప్రభావం..

సికిల్‌సెల్ ఎనిమియా వ్యాధి ఏజెన్సీ, గిరిజన ప్రాంతాల్లో ఎక్కువగా ప్రభలే అవకాశాలు ఉన్నాయి. గిరిజన సమూహాలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో వ్యాధి బారిన పడే ప్రమాదముందని, అక్కడ ఉంటున్న ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు స్క్రీనింగ్ పరీక్షలను నిర్వహిస్తున్నారు. జిల్లాలో మొదటి విడత స్క్రీనింగ్‌లో భాగంగా గార్ల, బయ్యారం, గంగారం, కొత్తగూడ, గూడూరుతో పాటు మరికొన్ని ప్రాంతాల్లో ఎక్కువ మందికి వ్యాధి పరీక్షలను నిర్వహించినట్లు అధికారులు చెబుతున్నారు. ఆయా ప్రాంతాల్లోని పీహెచ్‌సీలో వైద్యాధికారులు, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు అందుబాటులో ఉంటారని, ప్రతి ఒక్కరు స్క్రీనింగ్ చేసుకోవాలని సూచిస్తున్నారు. గిరిజన ప్రాంతాలతో పాటు గిరిజనేతర ప్రాంతాల్లో కూడా పరీక్షలను నిర్వహిస్తున్నారు.

వైద్య పరీక్షలు చేయించుకోవాలి



ప్రతి ఒక్కరు సికిల్‌సెల్ వ్యాధి నిర్ధారణ కోసం నిర్వహించే పరీక్షలను చేయించుకోవాలి. వ్యాధి ముందస్తుగా నిర్ధారణ జరిగితే తద్వారా మరొకరికి సోకకుండా జాగ్రత్తలు తీసుకోవచ్చు. 0నుంచి 40 సంవత్సరాల లోపు వారందరికీ పరీక్షలు నిర్వహిస్తున్నాం. అనుమానితులు ఎవరున్నా సమీపంలోని పీహెచ్‌సీలలో పరీక్షలు చేయించుకోవచ్చు. వైద్య చికిత్సల కోసం వైద్యాధికారులను సంప్రదించాలి.

– ఏ.నాగేశ్వర్‌రావు, ప్రోగ్రాం ఆఫీసర్

దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్ అర్బన్: ఇంటర్మీడియట్ కార్పొరేట్ కళాశాలల్లో 2024–25 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు నేటి నుంచి ఈ నెల 30వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ అధికారి బి.బాలరాజు మంగళవారం తెలిపారు. 7జీపీఏ, ఆ పైగా ఫలితాలు సాధించిన ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలు, బెస్ట్ అవైలబుల్ స్కూళ్లలో చదివిన విద్యార్థులు మాత్రమే అర్హులన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనార్టీ, దివ్యాంగ విద్యార్థులు ప్రవేశం పొందే అవకాశం ఉందన్నారు. జూన్ 3న సీజీజీ ఆన్‌లైన్ ఆటోమెటిక్ సిస్టమ్ ద్వారా విద్యార్థులను ఎంపిక చేస్తారని, జూన్ 6న ఎస్సీ కార్యాలయ అధికారులు సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేస్తారన్నారు. అర్హులు కుల, ఆదాయం, పదో తరగతి పాస్ మార్కుల మెమో, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, బ్యాంకు పాస్‌బుక్, దివ్యాంగ ధ్రువీకరణ పత్రం, స్టడీ సర్టిఫికెట్స్ (నాలుగు నుంచి పదో తరగతి వరకు తెలంగాణలో చదివి ఉండాలి) హాస్టల్ బోనఫైడ్ సర్టిఫికెట్, రెండు పాస్‌ఫొటోలు అందజేయాలన్నారు. పూర్తి వివరాలకు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

అమ్మవారికి పల్లకి, శేషవాహనసేవ



విద్యారణ్యులవారికి పూజలు



అమ్మవారికి పల్లకిసేవ

- ఘనంగా విద్యారణ్య జయంతి ఉత్సవం

హన్మకొండ కల్చరల్ : వరంగల్ భద్రకాళి దేవాలయంలో స్వామి, అమ్మవార్ల కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయప్రధానార్చకులు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం నిత్యాహ్నికం, చతుస్థానార్చన నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఉత్సవమూర్తిని అలంకరించి పల్లకిసేవలో ఊరేగించారు. సాయంత్రం శేషవాహనంపై ఊరేగించారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, బీఆర్‌ఎస్ పార్టీ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ సుధీర్‌కుమార్ తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. పూజా కార్యక్రమాలకు నాయీబ్రాహ్మణసంఘం నాయకులు ఉభయదాతలుగా వ్యవహరించారు. సంఘం అధ్యక్షుడు నాగవెల్లి సురేష్‌కుమార్, రిటైర్డ్ ఎస్పీ దుగ్యాల అశోక్‌కుమార్, బీజేపీ నేత సూర్యపల్లి శ్రీనివాస్, కొడిపాక కుమారస్వామి, కురిమిల్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా శ్రీవిద్యారణ్యుల జయంతిని పురస్కరించుకుని భద్రకాళి అమ్మవారి దేవాలయం ఆర్చి వద్ద శ్రీవిద్యారణ్యుల విగ్రహానికి అర్చకులు పూలమాలలు వేసి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

క్లుప్తంగా

జనగామలో బాలిక కిడ్నాప్!

- కేసును ఛేదించిన పోలీసులు.. నలుగురిపై కేసు

జనగామ : జనగామ పట్టణానికి చెందిన ఓ బాలికను కిడ్నాప్ చేసిన కేసులో నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రఘుపతి రెడ్డి మంగళవారం తెలిపారు. సీఐ కథనం ప్రకారం.. బాలికకు ఓ వ్యక్తితో రెండు నెలల క్రితం ఇన్‌స్టాలో పరిచయం ఏర్పడింది. రోజువారీగా చాటింగ్ చేస్తున్న క్రమంలో బాలికను హైదరాబాద్‌కు రావాలని కోరగా, ఆమె అంగీకరించినట్లు తెలిపారు. జనగామకు చెందిన ముగ్గురు వ్యక్తుల సాయంతో ఈ నెల 12వ తేదీ రాత్రి సెల్ఫ్ డ్రైవింగ్ (జీపీఎస్ ట్రాకింగ్ ఉన్న వాహనం) కారు తీసుకుని హైదరాబాద్‌కు వెళ్లిందన్నారు. బాలిక కనిపించడం లేదనే కుటుంబీకుల ఫిర్యాదు మేరకు ఆరా తీయగా, జనగామకు చెందిన కారులో వెళ్లినట్లు సమాచారం అందగా కారు ఓనర్‌ను పిలిపించామన్నారు. కారుకు జీపీఎస్ ఉండడంతో దాని ఆధారంగా బాలిక ఉన్న ప్రదేశం కనిపెట్టి, నలుగురు వ్యక్తులతో పాటు ఆమెను తీసుకొచ్చామన్నారు. బాలిక వాంగ్మూలం రికార్డు చేసినట్లు, కిడ్నాప్ చేశారని తేలితే నలుగురిని రిమాండ్‌కు పంపిస్తామన్నారు. ఇటీవల రాష్ట్రంలో అనేక చోట్ల మహిళలు, బాలికలను మాయమాటలతో ట్రాప్‌లో పడేస్తూ..అమ్మకానికి పెడుతున్నట్లు జరుగుతున్న ప్రచారం నేపథ్యంలో పోలీసులు ఆ దిశగా దర్యాప్తు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

మానుకోటలో రెండిళ్లలో చోరీ

- మూడు తులాల బంగారం, 19 తులాల వెండి, రూ.5 వేల నగదు అపహరణ



దొంగలు పగుల గొట్టిన బీరువా



ఘటనా స్థలిని పరిశీలిస్తున్న టౌన్ ఎస్సై

మహబూబాబాద్ రూరల్ : మానుకోట జిల్లా కేంద్రంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉండే ఇరువురి ఇళ్లలో సోమవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. ఈ ఘటనలో మూడు తులాల బంగారం, 19 తులాల వెండి ఆభరణాలు, రూ.5 వేల నగదు అపహరించారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆమనగల్ కెనరా బ్యాంక్‌లో మేనేజర్‌గా పనిచేస్తున్న బానోత్ సతీష్, కుటుంబ సభ్యులు కలిసి ఓటు వేసేందుకు ఇటీవల సొంతూరుకు వెళ్లారు. మంగళవారం ఉదయం వారు తిరిగి ఇంటికి వచ్చి చూసేసరికి ప్రధాన ద్వారం తాళం పగులగొట్టి ఉండడం కనిపించింది. దీంతో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. టౌన్ ఎస్సై శివ, ఫింగర్ ప్రింట్స్ బృందం సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. అలాగే వారి పక్కింట్లో నివాసం ఉండే నరేష్ ఇంట్లోనూ దొంగలు పడి తులం బంగారు చైన్ ఎత్తుకెళ్లారు. మరో రెండు ఇళ్లలో చోరీలకు యత్నించినప్పటికీ ఎలాంటి బంగారం, వెండి ఆభరణాలు, నగదు దోచుకుపోలేదు. ఘటనలపై బాధితులు టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ప్రమాదాలకు కేరాఫ్.. దాబాలు

జాతీయ రహదారిపై ప్రమాదకర ప్రదేశాల్లోనే ఏర్పాటు

- రోడ్డు ప్రమాదాలు జరిగి పలువురి మృతి
- పట్టించుకోని అధికారులు, పోలీసులు



మీదికొండ క్రాస్ సమీపంలోని దాబా

స్టేషన్‌ఘన్‌పూర్: సాధారణంగా జాతీయ రహదారిపై క్రాసింగ్‌లు.. యూ టర్న్‌లు ఉన్న ప్రదేశాల్లో దాబాల (హోటళ్లు) ఏర్పాటుకు సంబంధిత అధికారులు అనుమతి ఇవ్వరు. ఎందుకంటే వాయువేగంతో దూసుకొచ్చే వాహనాలు అదుపు తప్పి ఈ హోటళ్లను ఢీకొంటే తీవ్ర ఆస్తి, ప్రాణ నష్టం జరుగుతుంది. అలాగే, భోజనం చేసి బయటకు వచ్చే సమయంలో ప్రయాణికులు రోడ్డు ప్రమాదాల బారినపడే అవకాశం ఉంది. అందుకే ఈ ప్రాంతాల్లో దాబాల ఏర్పాటుకు అనుమతి ఇవ్వొద్దని నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. అయితే హైదరాబాద్–హనుమకొండ జాతీయ రహదారిపై నియోజకవర్గ కేంద్రం స్టేషన్‌ఘన్‌పూర్‌లో మాత్రం ఆ నిబంధనలు అమలు కావడం లేదు. ఏ కారణం చేతనో కాని అధికారులు అనుమతి ఇవ్వడంతో నిర్వాహకులు ఆయా ప్రదేశాల్లోనే ఏర్పాటు చేశారు. మండలంలోని మీదికొండ క్రాస్ వద్ద ఒకటి, స్టేషన్‌ఘన్‌పూర్‌లో పాత శ్రీవాణి స్కూల్ సమీపాన మరొటి, పల్లగుట్ట క్రాస్ సమీపం ఎస్సీ కాలనీ వద్ద రెండు.. మొత్తం నాలుగు ప్రమాదకర ప్రదేశాల్లోనే ఏర్పాటు చేశారు. ఫలితంగా భోజనం, ఇతర పదార్థాలు భుజించడానికి గతంలో ఆయా దాబాలకు వచ్చిన పలువురు పలుమార్లు రోడ్డు ప్రమాదాలకు గురయ్యారు. అయినా సంబంధిత అధికారులు, స్థానిక పోలీసులు ఈ విషయమై ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. కాగా, మండలంలోని మీదికొండ క్రాస్ వద్ద ఉన్న దాబాహోటల్ సమీపంలో ఏడాది క్రితం రాజధాని బస్సు ఢీకొన్న ఘటనలో కారులో ఉన్న ముగ్గురు మృతిచెందిన విషయం తెలిసిందే. అదే విధంగా జాతీయ రహదారిపై ఇటీవల పలు రోడ్డు ప్రమాదాలు జరిగినా సంబంధిత అధికారులకు పట్టడం లేదు. ఈ విషయంలో సంబంధిత అధికారులు, పోలీసులకు అమ్యామ్యాలు అందుతున్నాయనే ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి.



ఘన్‌పూర్ శివారు క్రాస్ వద్ద..



ఘన్‌పూర్ ఎస్సీ కాలనీ క్రాస్ వద్ద ..

పేరుకే ఫ్యామిలీ దాబా..

పేరుకే ఫ్యామిలీ దాబా. లోపల మాత్రం ఇష్టారాజ్యంగా మద్యం అమ్మకాలు చేపడుతున్నారు. అటు ఎక్సైజ్.. ఇటు సివిల్ పోలీసులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తుండడంతో దాబాల వ్యాపారం మూడు పువ్వులు, ఆరుకాయలుగా నడుస్తోంది. యజమానులు ఆడిందే ఆట.. పాడిందే పాటగా మారుతోంది. ఇదిలా ఉండగా గతంలో దాబాల వద్ద జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాలు జరిగి పలువురు మృతి చెందారు. ఫలితంగా ఆయా కుటుంబాలు రోడ్డున పడ్డాయి. అయినా సంబంధిత అధికారులు ప్రమాదాల నివారణకు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. ఇప్పటికైనా స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

మెస్ ఓపెన్ చేయాలి

- కేయూలో విద్యార్థినుల ఆందోళన
- రిజిస్ట్రార్ మల్లారెడ్డితో వాగ్వాదం



విద్యార్థి సంఘాల బాధ్యులు, విద్యార్థులతో మాట్లాడుతున్న వీసీ రమేశ్

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలో పద్మాక్షి మహిళా మెస్ ఓపెన్ చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థినులు ఆ హాస్టల్ వద్ద ఆందోళనకు దిగారు. ఎస్ఎఫ్ఐ , ఏబీఎస్ఎఫ్, పీడీఎస్‌యూ నాయకులు మంద శ్రీకాంత్, మంద నరేష్, మర్రి మహేష్, తదితరులు మద్దతు పలికారు. ఆందోళన సమాచారం అందుకున్న కేయూ హాస్టళ్ల డైరెక్టర్ శ్రీనివాస్‌రావు ఘటనాస్థలికి చేరుకుని ఆయా సంఘాల నాయకులు, విద్యార్థినులతో మాట్లాడారు. విద్యార్థినుల సంఖ్య సరిపడా ఉంటేనే మెస్‌ను ఓపెన్ చేస్తామని వారికి తెలిపారని సమాచారం. ఈ సందర్భంలో డైరెక్టర్‌తో వాగ్వాదానికి దిగారు. ఆ తరువాత విద్యార్థినులు, ఆయా సంఘాల బాధ్యులు క్యాంపస్‌లోని పరిపాలన భవనానికి చేరుకుని ఆందోళనకు దిగారు. కామన్‌మెస్, పద్మాక్షి మహిళా హాస్టళ్ల మెస్‌లను ఓపెన్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం వీసీ రమేశ్‌తో కలిసి మెస్‌లు ఓపెన్ చేయాల్సిందేనని పట్టుబట్టారు. దీంతో ఈనెల 15నుంచి మహిళా హాస్టల్ మెస్‌ను రీఓపెన్ చేయిస్తామని హామీ ఇచ్చారని సమాచారం. సరిపడా విద్యార్థులు వచ్చాకే (బాయ్స్‌కు) కామన్ మెస్ రీఓపెన్ చేయిస్తామని విద్యార్థి సంఘాల బాధ్యులు, విద్యార్థులకు తెలియజేశారని సమాచారం. దీంతో ఆందోళన విరమించారు. కాగా, పీజీ, ఇతర కోర్సులు కలిగిన విద్యార్థినులు మెస్‌కార్డులు కలిగివారిలో 25శాతం మంది వస్తే మెస్‌ను రీఓపెన్ చేస్తామని, కామన్‌మెస్‌లో కూడా 25శాతం మంది విద్యార్థులు వస్తే రీఓపెన్ చేస్తామని హాస్టళ్ల డైరెక్టర్ శ్రీనివాస్‌రావు వివరణ ఇచ్చారు.

మెస్‌లు ఓపెన్..

కాకతీయ యూనివర్సిటీలో మంగళవారం రాత్రి మెస్‌లు ఓపెన్ అయ్యాయి. మెస్‌లు ఓపెన్ చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు ఆందోళన చేసిన నేపథ్యంలో పద్మాక్షి మహిళా హాస్టల్‌లో వర్కర్లతో వంట చేయించారు. అనంతరం పద్మాక్షి హాస్టల్ విద్యార్థినులు, అలాగే అక్కడి నుంచి కామన్ మెస్‌కు తీసుకొచ్చి విద్యార్థులకు(బాయ్స్) భోజనం వడ్డించారు. కాగా, నేటినుంచి (బుధవారం) కామన్‌మెస్, పద్మాక్షిమెస్ యథావిధిగా కొనసాగించబోతున్నారు. విద్యార్థులు ఎక్కువమంది వస్తే రెండు చోట్ల వంటచేసి మెస్ సదుపాయం కల్పించాలని, లేనిపక్షంలో ఒకే చోట వంట చేసి పద్మాక్షి హాస్టల్ విద్యార్థినులు, కామన్‌మెస్‌కు సదుపాయం కల్పించాలని యూనివర్సిటీ అధికారులు యోచిస్తున్నారు.

రైలునుంచి పడి యువకుడి మృతి



ఇమ్రాన్ అన్సారి (ఫైల్)

కాశిబుగ్గ: రైలు నుంచి పడి ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం చింతలపల్లి, వరంగల్ రైల్వే స్టేషన్ల మధ్య చోటుచేసుకుంది. జీఆర్పీ సీఐ నరేష్ కథనం ప్రకారం .. ముంబాయికి చెందిన మహమ్మద్ ఇమ్రాన్ అన్సారి (18) తన బావతో కలిసి ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రిలో కొంత కాలంగా ఏసీ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. అయితే అన్సారి.. తన బావ, స్నేహితుడితో కలిసి ముంబాయి వెళ్లడానికి రాజమండ్రిలో కోణార్క్ ఎక్స్‌ప్రెస్ ఎక్కాడు. ధర్మారం రైల్వే గేట్ సమీపంలో రైలు నుంచి పడ్డాడు. దీంతో అప్‌లైన్ ట్రాక్ పక్కన పడి మృతి చెందాడు. ఈ ఘటనపై డిప్యూటీ ఎస్ఎస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బావ ఫక్రుద్దీన్ అన్సారికి అప్పగించామని సీఐ తెలిపారు.

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య..

సంగెం/కాశిబుగ్గ: మద్యం మానలేక ఓ యువకుడు రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన సంగెం మండలంలో చోటు చేసుకుంది. జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ రాజు కథనం ప్రకారం.. మండలంలోని కుంటపల్లికి చెందిన కలకొండ సుగుణ, సదానందం దంపతులకు ఇద్దరు కుమారులు రమేష్, మహేందర్ (28) ఉన్నారు. పిల్లల చిన్నతనంలోనే తల్లిదండ్రులు చనిపోయారు. అప్పటి నుంచి పెద్దమ్మ, పెద్ద నాన్న జయలక్ష్మి, వెంకటనారాయణ పెంచారు. మహేందర్ కులవృత్తి వండ్రంగితో పాటు లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. మద్యం మానుకోలేక జీవితంపై విరక్తి చెంది మంగళవారం చింతలపల్లి–ఎల్గూర్‌స్టేషన్ మధ్య రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని సోదరుడు రమేష్‌కు అప్పగించినట్లు జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ రాజు తెలిపారు.



మహేందర్ (ఫైల్)

విద్యుదాఘాతానికి వృద్ధురాలి బలి



కొమురమ్మ(ఫైల్)

తొర్రూరు రూరల్: విద్యుదాఘాతానికి ఓ వృద్ధురాలు బలి అయింది. ఈ ఘటన మండలంలోని కంఠాయపాలెంలో చోటు చేసుకుంది. ఎస్సై పిల్లల రాజు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బొల్లికొండ నాగమణి, ఇద్దమ్మ.. సోమవారం రాత్రి ఇంట్లో ఇనుప దండెంపై దుస్తులు ఆరవేస్తుండగా కరెంట్‌షాక్‌కు గురై కేకలు వేశారు. ఈ కేకలు విన్న ఇంటి పక్కన ఉన్న డొనుక కొమురమ్మ(70) వారిని కాపాడేందుకు వెళ్లి తాను కూడా విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందింది. నాగమణి, ఇద్దమ్మకు గాయాలయ్యాయి. ఈ ఘటనపై మృతురాలి కుమారుడు కొమురయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం

జనగామ రూరల్: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. ఈ ఘటన పట్టణంలోని విజయ డెయిరీ బైపాస్ వద్ద చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పాల కేంద్ర ఏరియాకు చెందిన మునుకుంట్ల రవి (37) సోమవారం రాత్రి తన పని ముగించుకుని ద్విచక్రవాహనంపై ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో హనుమాన్ గుడి వద్ద వెనక నుంచి యశ్వంతాపూర్ నుంచి జనగామకు వస్తున్న కారు ఢీకొంది. ఈ ఘటనలో రవికి తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే రవిని ఏరియా ఆసుపత్రికి తరలిస్తున్న క్రమంలో మృతిచెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై సృజన్ తెలిపారు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఏటూరునాగారంలో మరో యువకుడు..

ఏటూరునాగారం: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. ఈ ఘటన మంగళవారం రాత్రి ఏటూరునాగారంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం మంగపేట మండలం కమలాపురం గ్రామానికి చెందిన గుగ్గిల్ల రమేశ్(38) పని నిమిత్తం ద్విచక్రవాహనంపై ఏటూరునాగారం మండలం రొయ్యూరు గ్రామానికి వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో మండల కేంద్రంలోని 163 జాతీయ రహదారిపై ఉన్న హైవే ట్రీట్ హోటల్ వద్ద రోడ్డు ప్రమాదానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని ఏటూరునాగారం ఆసుపత్రికి తరలించారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కృష్ణప్రసాద్ తెలిపారు. అయితే రమేశ్‌ను గుర్తుతెలియని వాహనం ఢీకొందా..? లేదా పార్కింగ్ చేసి ఉన్న లారీని ఢీకొని మృతి చెందడా అనే విషయం తెలియాల్సి ఉంది.



రవి (ఫైల్)



రమేశ్ (ఫైల్)

పోలింగ్ రోజు కాంగ్రెస్ ప్రచారం

- బీజేపీ ఎంపీ అభ్యర్థి అరూరి రమేశ్



మాట్లాడుతున్న అరూరి రమేశ్

హన్మకొండ: ఓడిపోతామనే భయంతో పోలింగ్ రోజు కాంగ్రెస్ సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేసి ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిందని బీజేపీ వరంగల్ ఎంపీ అభ్యర్థి అరూరి రమేశ్ అన్నారు. మంగళవారం హనుమకొండ హంటర్ రోడ్డులోని వేద బాంక్వెట్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోలింగ్ రోజు సోషల్ మీడియా ద్వారా చేసిన ప్రచారంతో పాటు, తనను ఓటర్లు నిలదీస్తున్నట్లు ఒక చానల్ పేరుతో చేసిన ఫేక్ న్యూస్‌పై ఎన్నికల కమిషన్‌కు బీజేపీ లీగల్ సెల్ ఫిర్యాదు చేస్తుందన్నారు. తనకు ఓటు వేసిన ఓటర్లకు, తన గెలుపుకు కృషి చేసిన పార్టీ శ్రేణులు, అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు. నల్లగొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి మాట్లాడుతూ తనను ఎమ్మెల్సీగా గెలిపించాలని కోరారు. అనంతరం బిహార్ మాజీ ఉప ముఖ్యమంత్రి సుశీల్ కుమార్ మోదీ మృతికి నిమిషం మౌనం పాటించి సంతాపం తెలిపారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మార్తినేని ధర్మారావు, బీజేపీ వరంగల్ పార్లమెంట్ ప్రభారి డా.వి.మురళీధర్ గౌడ్, హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్ రావు, కొలను సంతోష్ రెడ్డి పాల్గొన్నారు.

యథేచ్ఛగా గుట్టను తవ్వేస్తున్నారు

- అనుమతి లేకుండా వ్యాపారం
- పట్టించుకోని మైనింగ్ శాఖ అధికారులు



గుట్టను తవ్వుతున్న పొక్లెయినర్

హసన్‌పర్తి : మండలంలోని దేవన్నపేట ప్రభుత్వ పాఠశాల సమీపంలో గల గుట్ట క్వారీగా మారింది. అనుమతి లేకుండానే గుట్టను తవ్వేస్తున్నారు. అధికారులు కనుసన్నల్లో మట్టి దందా జరుగుతున్న ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దేవన్నపేట పరిధిలోని సర్వే నంబర్ 217లో సుమారు 17.02 ఎకరాల గుట్ట ఉంది. ఓ రియల్టర్ ఈ గుట్టను క్వారీగా మార్చేసి, రాత్రింబవళ్లు తేడా లేకుండా పొక్లెయినర్ సాయంతో మట్టిని తవ్వుతూ టిప్పర్ల ద్వారా నగరానికి తరలించి విక్రయిస్తున్నాడు. కొంతమంది అధికార పార్టీ నాయకులు, అధికారుల అండాతోనే సదరు వ్యాపారి మొరం దందా చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి.

ప్రభుత్వ ఆదాయానికి గండి

అక్రమంగా మట్టి దందా కొనసాగుతుండడంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది. మట్టి క్వారీ తవ్వేందుకు మైనింగ్ అనుమతి తప్పనిసరి. అయితే క్యూబిక్ మీటరుకు రూ.70ల నుంచి రూ.80 వరకు ప్రభుత్వానికి చలానా రూపంలో నగదు చెల్లించాల్సి ఉంటోంది. ఒక టిప్పర్ మట్టికి రూ.1,000 నుంచి రూ.1,200ల నగదు ప్రభుత్వానికి చెల్లించాలి. ఇప్పటికి ఈగుట్ట నుంచి వేలాది టిప్పర్ల మట్టి తరలించినట్లు స్థానికులు చెబుతున్నారు. మాముళ్ల మత్తులో అధికారులు సదరు యజమానిపై చర్యలు తీసుకోకుండ వెనుకంజ వేస్తున్నారని విమర్శలున్నాయి.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

TO-LET

- G+2, 3600 Sft గల కమర్షియల్ బిల్డింగ్ ఆఫీస్,బ్యాంక్స్, షాప్‌లకు అనుకూలమైనది కిరాయికి ఇవ్వబడును. Cont: # 19-10-206/1, గవిచర్ల 'X' రోడ్, శంభునిపేట్, WGL. Cell: 9849111183. [W-1242452]

PLOT FOR SALE

- మున్సిపల్ కార్పొరేషన్ లిమిట్స్, హసన్‌పర్తిలో వాస్తుకు అనుగుణంగా, ఇల్లు కట్టుకోవడానికి వీలుగా, పక్కా డాక్యుమెంట్స్ గల ప్లాట్లు EMI పద్ధతిలో అమ్మకానికి కలవు. సంప్ర॥ 9866826236, 7013112534 [WA-7523]

WANTED

- Education Instituteలో Admission Purpose Telecaller కావలెను. అనుభవం ఉన్న వారికి మొదటి ప్రాధాన్యత. నక్కలగుట్ట. Salary: 15000 to 20000. Cell: 9090979703 [WA-7524]
- ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500/– మీ పేరు, అడ్రస్ కాల్/ వాట్సప్ చేయగలరు. 9502615217. [M-1185077]
- త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీ. 18K ఫోన్: 9160900024/9640400073 [H-799880]

WANTED TEACHERS

- Wanted teachers to teach 1st to 5th Class English, E.V.S Wardens Male and Female, Cook (Female) 8801802586, 9397696508. [W-1200891]
- To teach pre primary Experience and Fluency in Spoken English And Academic Co-Ordinator Experience and Fluency in Spoken English. Cell No: 9849943040. [W-1242455]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/- రూ॥ అదనపు లైను 60/- రూ॥ మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ	9010144453
వరంగల్	9705748198
నర్సంపేట	9553955722
జనగామ	9951602871
మహబూబాబాద్	9010144453
పరకాల	9010299096
జయశంకర్ భూపాలపల్లి	9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

కేయూ హాస్టళ్ల డైరెక్టర్‌గా సమ్మయ్య

- ఉత్తర్వులు జారీచేసిన రిజిస్ట్రార్ మల్లారెడ్డి



సమ్మయ్యకు ఉత్తర్వులు అందజేస్తున్న వీసీ రమేశ్, రిజిస్ట్రార్ మల్లారెడ్డి

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ హాస్టళ్ల డైరెక్టర్‌గా ఫార్మసీ కళాశాల డీన్ గాదె సమ్మయ్యను మంగళవారం రాత్రి నియమించారు. ఈమేరకు కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి ఉత్తర్వులు జారీచేశారు. ఈమేరకు నియామక ఉత్తర్వు కాపీని వీసీ రమేశ్.. సమ్మయ్యకు అందజేశారు. సమ్మయ్య గతంలో కేయూ అంబేడ్కర్ స్టడీస్ సెంటర్ డైరెక్టర్‌గా, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్‌గా, బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. నేడు ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు. కాగా, కేయూ హాస్టళ్ల డైరెక్టర్ శ్రీనివాస్‌రావు మంగళవారం తన పదవికి రాజీనామా చేశారు. పద్మాక్షి మహిళా హాస్టల్ వద్ద విద్యార్థినులు మెస్ ఓపెన్ చేయాలని ఆందోళన చేయడం, వాగ్వాదానికి దిగడంతో మనస్తాపానికి గురైన ఆయన.. తన పదవికి రాజీనామా చేశారని తెలుస్తోంది. శ్రీనివాస్‌రావు స్థానంలో సమ్మయ్యను నియమించారు.

మూడేళ్లలో నలుగురు హాస్టళ్ల డైరెక్టర్లు విధులు!

కేయూ వీసీ రమేశ్ 2021 మే 23న బాధ్యతలు స్వీకరించారు. ఈనెల 21న మూడేళ్ల పదవీ కాలం పూర్తికాబోతుంది. రమేశ్ బాధ్యతలు స్వీకరించేనాటికే హాస్టళ్ల డైరెక్టర్‌గా జువాలజీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ ఎం ఇస్తారి బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. 2017సెప్టెంబర్ నుంచి 2022 ఫిబ్రవరి వరకు కొనసాగారు. పలు కారణాలతో ఆయన పదవికి రాజీనామా చేయగా 2022 మార్చిలో కంప్యూటర్ సైన్స్ విభాగం ప్రొఫెసర్ మంజులను నియమించారు. 2023 జూలై 4వరకు కొనసాగుతుండగానే ఆమె స్థానంలో జువాలజీ విభాగం ప్రొఫెసర్ వై వెంకయ్యను 2023 జూలై 5న నియమించారు. అనంతరం ఆయన స్థానంలో 2024 జనవరిలో పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం ప్రొఫెసర్ శ్రీనివాస్‌రావును నియమించారు. నాలుగు నెలలు 5రోజులకే రాజీనామా చేయగా ఆయన స్థానంలో ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ సమ్మయ్యను నియమించారు.

ఇళ్లలో కట్టేసిన పశువుల అపహరణ

- మహిళను స్తంభానికి కట్టేసిన గ్రామస్తులు
- పోలీసులకు అప్పగింత

నర్సంపేట రూరల్ : ఇళ్లలో కట్టేసిన గేదెలు, ఆవులు, దూడలను అపహరిస్తున్న ఓ ముఠాను పట్టుకునేందుకు ప్రయత్నించగా ఒకరు చిక్కగా, మరో ముగ్గురు పరారయ్యారు. స్థానికుల కథనం ప్రకారం.. మంగళవారం నర్సంపేట పట్టణంలోని సర్వాపురం గ్రామ శివారు ఐదోవార్డులో రాత్రి వేళలో కొందరు ముఠాగా ఏర్పడి గేదెలు, ఆవులు, దూడలను అపహరిస్తున్నారు. సోమవారం రాత్రి సైతం ఇదే విధంగా నలుగురు వచ్చి పలు ఇళ్లలోని దూడలను, గేదెలు తీసుకెళ్తుండగా అలజడి వచ్చింది. దీంతో స్థానికులు ఒక్కసారిగా లేచి వారిని వెంబడించడంతో గేదెలు, దూడలను వదిలి పారిపోయారు. ఆ ముఠాలో ఓ మహిళ చేతికి చిక్కడంతో ఆమెను స్తంభానికి కట్టేసి మిగతా ముగ్గురి కోసం గాలించారు. వారు దొరకక పోవడంతో మంగళవారం ఉదయం సదరు మహిళను పోలీసులకు అప్పగించి ఫిర్యాదు చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. పోలీసులు పూర్తి స్థాయిలో విచారణ చేపట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



పశువుల అపహరణకు యత్నించిన మహిళను కట్టేసిన గ్రామస్తులు

యువకుడి ఆత్మహత్యాయత్నం

చెన్నారావుపేట : తోటిమిత్రులు దాడి చేయడంతో ఓ యువకుడు ఎలుకల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ ఘటన మండలంలోని ఎల్లాయగూడెంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై అరుణ్‌కుమార్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మంద జనార్దన్ కుమారుడు నితీష్‌ను తన స్నేహితులు గొడవపడి సోమవారం సాయంత్రం కొట్టారు. దీంతో అవమానాన్ని తట్టుకోలేక గ్రామ శివారులో ఎలుకల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. భయపడిన వెంటనే నితీష్ తన తండ్రికి ఫోన్ చేసి మందు తాగిన విషయం చెప్పడంతో చికిత్స నిమిత్తం నర్సంపేట ఆస్పత్రికి తరలించగా, ప్రస్తుతం చికిత్స పొందుతున్నాడు. నితీష్ తండ్రి ఫిర్యాదు మేరకు అర్కాల రాజేష్, పుటికల చంద్రకిరణ్, చరణ్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

లైంగిక దాడికి యత్నించిన ఒకరికి జైలు



వరంగల్ లీగల్ : బాలికపై లైంగిక దాడికి యత్నించి బెదిరింపులకు పాల్పడ్డ ఒకరికి నాలుగేళ్ల జైలు శిక్ష, రూ.4 వేల జరిమానా విధిస్తూ మంగళవారం హనుమకొండ మొదటి అదనపు జిల్లా కోర్టు జడ్జి బి.అపర్ణాదేవి తీర్పు వెల్లడించారు. కమలాపూర్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన విద్యార్థిని స్థానిక జిల్లా పరిషత్ స్కూల్‌లో పదో తరగతి చదువుతోంది. అయితే 2018 ఆగస్టు 4న ఇల్లు శుభ్రం చేస్తున్న సమయంలో ఎవరు లేరని నిర్ధారించుకున్న అదే గ్రామానికి చెందిన ఎల్ల బోయిన గణేష్ (20) ఇంట్లోకి చొరబడ్డాడు. ఒంటరిగా ఉన్న బాలిక చేయిపట్టి లాగి 'నువ్వంటే నాకు ఇష్టం.. నా కోరిక తీర్చు.. లేదంటే నిన్ను చంపుతాన'ని బెదిరించాడు. భయభ్రాంతులకు గురైన బాధిత బాలిక గట్టిగా అరుస్తూ గణేష్ నుంచి తప్పించుకోని బయటకు పరిగెత్తింది. చుట్టు పక్కల వారు రావడంతో సదరు యువకుడు అక్కడి నుంచి పారిపోయాడు. తల్లిదండ్రులు వచ్చిన తర్వాత జరిగిన విషయం తెలిపింది. చీకటి పడటంతో మరుసటి రోజు కమలాపూర్ పోలీస్‌స్టేషన్‌లో బాధిత బాలిక తల్లి ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన కోర్టు నేరం రుజువు కావడంతో ఎల్లబోయిన గణేష్‌కు నాలుగేళ్ల జైలు శిక్ష, రూ.4 వేల జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు ఇచ్చారు. కేసును పోలీస్ అధికారులు హరికృష్ణ, సందీప్, సూర్యప్రకాష్ విచారించారు. భరోసా కేంద్రం లీగల్ ఆఫీసర్ సీహెచ్ నీరజ, లైజన్ ఆఫీసర్ పరమేశ్వరి విచారణను పర్యవేక్షించగా, పీపీ రాజమల్లారెడ్డి కేసు వాదించారు.

యాక్సిడెంట్ కేసులో మరొకరికి ఏడాది..

మరిపెడ/మరిపెడ రూరల్: నర్సింహులపేట మండలం పెద్ద నాగారం గ్రామ పరిధి అమ్రియతండాకు చెందిన ఒకరికి తొర్రూరు జూనియర్ సివిల్ జడ్జి మట్ట సరిత ఏడాది జైలు శిక్షతో పాటు జరిమానా విధించినట్లు మరిపెడ ఎస్సై ఎస్‌కే తాహెర్‌బాబా మంగళవారం తెలిపారు. 2014లో మరిపెడ మున్సిపాలిటీకి చెందిన భూక్య లక్ష్మణ్ పని నిమిత్తం తన ద్విచక్ర వాహనంపై మరిపెడ మండలం దంటకుంటతండాకు వెళ్లాడు. తిరిగి మరిపెడ బంగ్లాకు క్రమంలో నర్సింహులపేట మండల పెద్దనాగారం గ్రామ పరిధి అమ్రియతండాకు చెందిన బానోత్ రమేశ్.. ట్రాక్టర్‌ను అజాగ్రత్తగా నడుపుతూ భవాని ఆలయం వద్ద బైక్‌ను ఢీకొనగా లక్ష్మణ్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి తండ్రి భూక్య హోలీ మరిపెడ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై నాగభూషణం కేసు నమోదు చేశారు. కేసు విచారణ అనంతరం తొర్రూరు సివిల్ కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కోర్టులో సాక్ష్యాధారాలు ప్రవేశపెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ గణేష్ ఆనంద్ వాదించారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన జడ్జి మట్ట సరిత.. బానోత్ రమేశ్‌కు ఏడాది జైలు శిక్షతో పాటు రూ.1500 జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారని ఎస్సై తెలిపారు.